నీటి కష్టాలు

- ఆరిలోవ, కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య
- నీటి సరఫరా సిబ్బంది సమ్మెతో కుళాయిలు బంద్
- బోర్ల వద్ద క్యూ కట్టిన సింహగిరి కాలనీ వాసులు
- బురద నీరు రావడంతో అవాక్కు
- కొండవాలులో నీటి సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి



పెదగదిలి దరి సింహగిరి కాలనీలో బోరు వద్ద బిందెలతో క్యూ కట్టిన మహిళలు (ఇన్‌సెట్) బోరు నుంచి వస్తున్న బురద నీరు



సింహగిరి కాలనీ కొండవాలు ప్రాంతం



ఆరిలోవ:

ఆరిలోవ ప్రాంతంలో నీటి కోసం జనం కటకటలాడుతున్నారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ సిబ్బంది వారి సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీవీఎంసీ జోన్–2 పరిధి ఆరిలోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మె చేపట్టారు. ఇది శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. దీంతో ఈ ప్రాంతంలో శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు పూర్తిగా నీటి సరఫరా నిలిపేశారు. సమ్మె విరమించి శనివారం సాయంత్రం నీటి సరఫరా చేసినప్పటికీ అన్ని ప్రాంతాలకు సక్రమంగా జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. మరికొన్ని ప్రాంతాల్లో కుళాయిలు విడిచిపెట్టినా.. రద్దీ పెరిగి అందరికీ సరిపడినంత నీరు లభించక ఇబ్బంది పడ్డారు. పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, రామకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ, టీబీసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్‌తోపాటు కొండవాలు ప్రాంతాల్లో స్థానికులు నీటి కోసం తంటాలు పడ్డారు.

కుళాయిలు రాకుంటే అంతే..

జీవీఎంసీ 9వ వార్డు పెదగదిలి దరి సింహగిరి కాలనీ కొండవాలు ప్రాంతంలో శుక్ర, శనివారాలు కుళాయిలు రాలేదు. దీంతో నివాసులంతా బోరు నీటి కోసం క్యూ కట్టాల్సి వచ్చింది. ఈ కాలనీలో నాలుగు బోర్లున్నాయి. వాటిలో రెండింటి నుంచి బురద నీరు రావడంతో అది పనికి రాకుండా పోయింది. శనివారం ఉదయం కుళాయిలు వస్తాయని ఎదురుచూసి బోరు నీటి కోసం బిందెలు పట్టుకొని వెళ్లిన మహిళలు బురద నీరు రావడంతో ఖంగుతిన్నారు. ఈ ప్రాంతంలో 360 వరకు నివాసాలున్నాయి. ఇక్కడ నివాసులకు జీవీఎంసీ కుళాయిలతోపాటు నాలుగు చోట్ల బోర్లున్నాయి. కుళాయి నీరు చాలనప్పుడు బోరు నీరే వీరికి ఆధారం. శుక్ర, శనివారాలు కుళాయిలు రాకపోవడంతో బోరు నీరు కోసం బిందెలు పట్టుకొని వెళ్లిన మహిళలకు రెండు బోర్లు సరిగా పనిచేయలేదు. వాటి నుంచి సన్నని బురద నీటి ధార రావడంతో నిరాశ చెంది ఖాళీ బిందెలతో ఇంటిముఖం పట్టారు.

కొండవాలులో మరిన్ని కష్టాలు

దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, హనుమంతవాక, ఆదర్శనగర్, బీసీ కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల్లో తాగునీరు, వాడుక నీటి కోసం జనం కటకటలాడారు. కుళాయిల నీరు రాలేదు సరికదా చేతి బోర్లను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. ఆయా కొండవాలు ప్రాంతాల్లో బోర్లు కూడా సరిగా పనిచేయడం లేదు. దీంతో కొండవాలు ప్రాంతాల నివాసులు నీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు.

నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం



మాది కొండవాలు ప్రాంతం. మాకు కుళాయి నీరే ఆధారం. రెండు రోజులు కుళాయిలు రాకపోవడంతో తాగడానికి నీరు లేక ఇబ్బందిపడ్డాం. మేం జీవీఎంసీకి నీటి పన్ను కడుతున్నాం. ఎప్పుడూ నీరు సరిపడినంత రావడం లేదు. ఇక్కడ నిత్యం తాగునీటి సమస్యే ఉంటుంది. అధికారులు మా కాలనీపై దృష్టి పెట్టాలి.
– సిహెచ్.పార్వతి, సింహగిరి కాలనీ

కాలనీలో నీటి సమస్య తీర్చాలి



మా సింహగిరి కాలనీ కొండవాలు ప్రాంతంపై అధికారుల దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలి. మాకు నీటి కొరత ఉంది. నీటి సరఫరా సిబ్బంది వారి సమస్యల కోసం కుళాయిలు విప్పడం మానేశారు. మాకు నీరు లేక కటకటలాడిపోతున్నాం. ఇలాంటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– పి.రమాదేవి, స్థానికురాలు

బోర్ల నుంచి బురద నీరు



మా కాలనీలో నాలుగు బోర్లున్నాయి. రెండింటిలో నుంచి బురద నీరు వస్తోంది. కుళాయి నీటితోనే సర్దుకుపోతున్నాం. రెండు రోజులుగా కుళాయిలు రాకపోవడంతో బోరు వద్దకు వెళ్తే అందులో బురద నీరు వస్తోంది. అది ఎందుకూ పనికిరావడం లేదు. తాగునీటి కోసం బయట క్యాన్‌లు కొనుక్కొని తెచ్చుకున్నాం.
– భగవతి, గృహిణి

క్లుప్తంగా

50 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్

ఎంవీపీకాలనీ: విశాఖ జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో సెయింట్ ల్యాబ్స్ ఆఫ్ స్కూల్స్ (సీఎల్ఎస్) పేరిట ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి గణేష్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐ, రోబోటిక్ టెక్నాలజీ అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సెయింట్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకుందని తెలిపారు. సీఎస్ఆర్‌లో భాగంగా సెయింట్ సంస్థ రానున్న 6 ఏళ్లలో విశాఖలోని 50 స్కూళ్లలో సీఎల్ఎస్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, గణేష్ మాట్లాడుతూ ఆధునిక ఏఐ, రోబోటిక్ టెక్నాలజీని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేరువ చేయాలన్నదే ఈ ల్యాబ్స్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశమన్నారు. రూ.8 కోట్లతో విశాఖలోని 50 స్కూళ్లలో ఈ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 28 ల్యాబ్‌లను భీమిలి నియోజకవర్గంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేస్తామన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మంత్రి గొట్టిపాటికి వినతిపత్రం అందిస్తున్న తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ప్రతినిధులు

విశాఖ సిటీ: విద్యుత్ సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను దశలవారీగా రెగ్యులర్ చేయాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం తరపున డిస్కం అధ్యక్షుడు బి.ఎం.నాయుడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. విశాఖకు వచ్చిన మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. కార్మికుల ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌కు మార్చాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా అధ్యక్షుడు వేదుల నగేష్, కార్యదర్శి టి.వి.రమణమూర్తి, జోన్–3 అధ్యక్షుడు కోన రవికిశోర్ పాల్గొన్నారు.


కళాభారతిలో నేడు చతుర్గుణిత అష్టావధానం



ద్విశతావధాని బులుసు అపర్ణ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విశ్వనాథ సాహితీ పీఠం సంయుక్తంగా ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో అరుదైన చతుర్గుణిత అష్టావధానాన్ని నిర్వహించనున్నాయి. ప్రఖ్యాత ద్విశతావధాని బులుసు అపర్ణ ఈ అవధానాన్ని నిర్వహిస్తారు. 30 ఏళ్ల తరువాత విశాఖలో జరుగుతున్న మొట్టమొదటి భారీ సాహితీ కార్యక్రమం ఇదేనని వీఎండీఏ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. సాధారణ అష్టావధానంలో ఎనిమిది మంది పృచ్ఛకులు ఉంటారు. అయితే, చతుర్గుణిత అష్టావధానంలో ఒకేసారి నాలుగు అష్టావధానాలు జరుగుతాయి. అంటే వేదికపై మొత్తం 32 మంది పృచ్ఛకులు ఉంటారు. ఇది అత్యంత కష్టతరమైన సాహితీ ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ పేరి రవికుమార్ పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. సాహితీ, సంగీత, సాంస్కృతిక ప్రియులందరూ ఈ నూతన ప్రక్రియను వీక్షించి ఆనందించాలని డాక్టర్ రాంబాబు కోరారు.

ఆర్టీఐ సమన్వయ సంఘం అదనపు కార్యదర్శిగా భవానీశంకర్



ఎంవీపీకాలనీ: సమాచార హక్కు సమన్వయ సంఘం విశాఖ జిల్లా అదనపు కార్యదర్శిగా ఎంవీపీ కాలనీకి చెందిన భవానీశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం విశాఖ వేదికగా జరిగిన సంఘం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి కమిటీలను సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి ప్రకటించినట్లు పేర్కొన్నారు.అదనపు కార్యదర్శిగా నిత్యం ప్రజా సమస్యలపై పోరాడతానన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా భవానీశంకర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా వలంటీర్ కమిటీ అధ్యక్షుడు పీలా ప్రేమ్‌కిరణ్ అభినందించారు.

'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



11వ వార్డు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పాల్గొన్న మాజీ మేయర్ హరివెంకటకుమారి, గొలగాని శ్రీనివాస్

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. జీవీఎంసీ 11వ వార్డు పెదగదిలిలో శనివారం మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మొల్లి అప్పారావు కార్యకర్తల నుంచి పార్టీ బలోపేతానికి సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు తెలిసేటట్లు అందరం కలసికట్టుగా కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు కె.మోహన్‌రావు, చిన్నారావు, జహింగీర్, షకీనా, కొల్లి అప్పారావు, సతీష్, పద్మ, నిర్మల, శ్రీను, కృష్ణారెడ్డి, రమణ, మక్బుల్ పాల్గొన్నారు.

ఏయూ సైన్స్ కళాశాలకు ఏటా రూ.లక్ష విరాళం



ఏయూ వీసీకి విరాళం చెక్కు అందిస్తున్న విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్ రాజా

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీకి భూములు దానం చేసిన జైపూర్ మహారాజా విక్రమ్ దేవ్ వర్మ బహదూర్ 156వ జయంతి వేడుకలు శనివారం ఏయూలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూకి చెందిన జైపూర్ విక్రమ్ దేవ్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి ఆ మహాసంస్థాన్ యువరాజా విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్ రాజా రూ.లక్ష వార్షిక స్కాలర్‌షిప్‌ను ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా చంద్రచూడ్ దేవ్ రాజా మాట్లాడుతూ గతంలో విక్రమ్ దేవ్ వర్మ ప్రతి ఏటా రూ.లక్ష విరాళం ఇచ్చేవారని, దానికి కొనసాగింపుగా ఈ ఏడాది నుంచి ఏటా రూ.లక్ష విరాళాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీకి ఇస్తామని తెలిపారు. ఈ మొత్తాన్ని ఉత్తమ విద్యార్థులకు లేదా ఫెలోషిప్ కోసం వినియోగిస్తారన్నారు. విద్యను ప్రజలకు అందించేందుకు, అభివృద్ధి కావడానికి గొప్ప సాధనంగా భావించిన దివంగత మహారాజు దార్శనికుడని కొనియాడారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆంధ్రా యూనివర్సిటీ కృషిని అభినందించారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ఏయూకి మహారాజా విక్రమ్ దేవ్ వర్మ ఎంతో భూమిని త్యాగం చేశారన్నారు. ఆయన వారసత్వానికి నివాళిగా మహారాజా కళింగ చారిటబుల్ ఫౌండేషన్ ఈ విరాళాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైపూర్ సంస్థానానికి చెందిన కిషన్ రాథోడ్, న్యాయవాది వజ్జిపర్తి శ్రీనివాస్, బీజేపీ నాయకులు మూల వెంకటరావు, క్రాంతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత వెంకట్ రెడ్డి, సైన్స్ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏయూ అభివృద్ధికి విక్రమ్‌దేవ్ వర్మ విశేష కృషి



విక్రమ్‌దేవ్ వర్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విరాళాలు అందించి వర్సిటీ అభివృద్ధికి జైపూర్ మహారాజా విక్రమ్ దేవ్ వర్మ చేసిన కృషి ప్రశంసనీయమని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. విక్రమ్ దేవ్ వర్మ జయంతి సందర్భంగా శనివారం భౌతిక శాస్త్రం విభాగం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వీసీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన నిపుణులను ఆహ్వానించి తీసుకురావడానికి విక్రమ్ దేవ్ వర్మ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ప్రో చాన్సలర్‌గా ఆయన అందించిన సేవలు, సూచనలు వర్సిటీ అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. సైన్స్ కళాశాల స్థాపనకు అవసరమైన నిధులు అందించడం, భౌతిక శాస్త్రం విభాగ భవనాన్ని నిర్మించడం వెనుక ఆయన అపార కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విక్రమ్ దేవ్ వర్మ కుటుంబ సభ్యులు రాణి మయూఖ దేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను మున్సిపల్ కార్మికులు విజయవంతం చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాజు పిలుపునిచ్చారు. పిఠాపురం కాలనీలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి భవనంలో కె.కుమారి అధ్యక్షతన శనివారం యూనియన్ జోన్–3 మహాసభ జరిగింది. ముఖ్య వక్తగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కాలరాస్తూ మోదీ సర్కార్ లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. వీటిని రద్దు చేయించడమే యూనియన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్ కార్మికులతో సమానంగా వేతనం చెల్లించాలని వర్కర్స్ యూనియన్, సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు డిమాండ్ చేశారు. మహాసభలో ముందుగా గత మూడేళ్లలో మృతిచెందిన కార్మికులకు నివాళులర్పించారు. యూనియన్ ఆధ్వర్యంలో జోన్ పరిధిలోని 10 వార్డుల్లో పోరాటాలు, విజయాలను కార్యదర్శి జె.ఆర్.పి.నాయుడు ప్రవేశపెట్టారు. కార్మికుల సమస్యలపై కౌన్సిల్‌లో హామీలే తప్ప.. అమలు జరగడం లేదని ఆయన మండిపడ్డారు.

22 మందితో నూతన కమిటీ

మహాసభ సందర్భంగా 22 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా వి.కృష్ణారావు, అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాస్, కార్యదర్శిగా జె.ఆర్.నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.కుమారి, ఉపాధ్యక్షులుగా కొండమ్మ, వెంకటరమణ, హాయ్ కార్యదర్శిగా లలిత, జగదీశ్వర్లుతోపాటు మిగిలిన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, కార్యదర్శి పి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు వి.నరేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్ గొలగాని అప్పారావు, ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట



రామకృష్ణాపురంలో ఆక్రమణ తొలగించి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



పొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ఆక్రమణలకు అధికారులు అడ్డుకట్ట వేశారు. ఇక్కడ కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు స్థానికుల నుంచి రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని రూరల్ మండలం తహసీల్దార్ పాల్‌కిరణ్‌ను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో ఆర్ఐ హరితేజ, వీఆర్వో సత్యందొర, జోన్–2 ఏసీపీ తిరుపతిరావు, టీపీవో, పలు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు, వీఆర్వోలు, ఆరిలోవ పోలీసుల బందోబస్తుతో శనివారం ఆక్రమణల స్థలాలను పరిశీలించారు. వాటిలో నిర్మించిన రేకుల షెడ్లను పొక్లెయిన్లతో నేలమట్టం చేశారు. నాలుగు షెడ్లు, రెండు పునాదులతోపాటు ఓ ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖాళీ స్థలంలో ఉన్న బోర్‌ను జీవీఎంసీ స్వాధీనం కొని మూసేశారు. ఆక్రమణలు తొలగించిన స్థలాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.

సవాళ్లు ఎదుర్కొనే యువ వ్యాపారవేత్తలు అవసరం



మాజీ వీసీ ముత్యాలనాయుడికి జ్ఞాపిక అందజేస్తున్న ఆచార్య కృష్ణమోహన్ తదితరులు

ఎంవీపీకాలనీ: సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతోపాటు సవాళ్లను ఎదుర్కొనే యువ వ్యాపారవేత్తలు నేడు ప్రపంచానికి అవసరమని ఆదికవి నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్నత ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం బీ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఐఐఏఎం వంటి ఉన్నత విద్యా సంస్థలు మేనేజ్‌మెంట్ విద్యలో గ్లోబల్ స్థాయి మార్పులు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులు సమర్థ నాయకత్వం, నూతన ఆలోచనలతోపాటు వ్యాపార రంగంలోని సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ఈ రకమైన లీడర్‌షిప్ ప్రస్తుతం వ్యాపార ప్రపంచానికి అవసరమన్నారు. గౌరవ అతిథి డాక్టర్ రవి ఈశ్వరపు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను సొంతం చేసుకోగలరన్నారు. ఐఐఏఎం బీ స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యలో తాజా ట్రెండ్స్‌పై నిపుణులు విద్యార్థులకు ఈ సదస్సు ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఐఏఎం డీన్ డాక్టర్ సుంకర రవీంద్ర, యాక్సస్ బ్యాంక్ ఏవీపీ వరుణ్ రవిపల్లి తదితరులు పాల్గొన్నారు.

పీవీ భారత్‌లో పుట్టడం ప్రజల అదృష్టం



పీవీ నరసింహారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ సోమయాజులు

బీచ్‌రోడ్డు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు లాంటి మహనీయుడు భారతదేశంలో పుట్టడం దేశ ప్రజలు చేసుకున్న అదృష్టమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, డిసిగ్నేట్ సుప్రీం కోర్ట్ అడ్వకేట్ జస్టిస్ డి.వి.వి.ఎస్.సోమయాజులు అన్నారు. పీవీ 104వ జయంతి సందర్భంగా వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం గవర్నర్ బంగ్లా వద్ద గల పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల శాస్త్ర విద్యా పారంగతుడిగా దేశ విదేశాల ప్రజలచే పీవీ కొనియాడబడటం దేశ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఎంతో సమర్థవంతంగా పూర్తి కాలం నడిపించడమే కాక, ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు.న్యాయవాది కె.వి.రామ్మూర్తి, న్యాయవాది నరసింహమూర్తి, వుడా మాజీ చైర్మన్ పి.ఎస్.ఎన్.రాజు, పారిశ్రామిక వేత్త చెరువు రామకోటయ్య, వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు వేదుల హనుమంతరావు, యువజన విభాగం ప్రతినిధులు టేకుమళ్ల అరుణ్‌కుమార్, భాగవతల శంకర్, జర్నలిస్ట్ సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, శాయిరామ్ సి.వి.ఎస్., కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్ ది హానరబుల్ కోర్ట్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) విశాఖపట్నం
SOP 10/2025

[illegible]

M. సునీల్
విశాఖపట్నం
తేది. 02-05-2025
సెల్ నెం. 9948717111

సమ్మోహనభరితం.. చిన్నారుల నాట్య విన్యాసం



చిన్నారి నాట్య కళాకారుల బృందంతో అతిథులు





నాట్య విన్యాసాలతో అలరిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం: చిన్నారి కళాకారులు తమ నాట్య విన్యాసంతో సమ్మోహన పరిచారు. అద్భుతమైన నాట్య భంగిమలతో ఆహూతులందరినీ మైమరపింపజేశారు. వివిధ దేవతామూర్తుల పాటలకు నృత్యం చేసి విశేషంగా ఆకట్టుకున్నారు. సాయి సురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 12వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాట్య పుష్కరాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

భరత కళ గ్రామ ఫౌండర్ అండ్ డైరెక్టర్ వసంత కిరణ్, వాడా ఫౌండర్ కన్నాం వెంకటరమణారావు, ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అతిథులను అద్యంతం కట్టిపడేశాయి. పలువురు ప్రముఖ కళాకారులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. తొలుత వక్తలు మాట్లాడుతూ 13 ఏళ్ల కిందట సోదరీమణులు సాయి సురేఖ, భాను రేఖ అట్లాడలు 2017లో విశాఖలో, తర్వాత 2022లో హైదరాబాద్‌లో నాట్యాచార్య డాక్టర్ అరుణ్ సాయికుమార్, నాట్యాచారులు డాక్టర్ వసంత కిరణ్ రయాసం ఆధ్వర్యంలో గురు వెంపటి చిన సత్యం వద్ద శిక్షణ పొందారని పేర్కొన్నారు. నదులకు వచ్చే పుష్కర కాలం నాట్య అకాడమీ పేరుతో వేడుకలు నిర్వహించడం అద్వితీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర, అభినయం స్కూల్ ఫర్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫౌండర్ డాక్టర్ పసుమర్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.